ప్రలోభాలపై నిఘా పెట్టండి

- కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని సందర్శించిన సాధారణ పరిశీలకుడు
- ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన
- అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచన
- నగదు, మద్యం అక్రమ రవాణాపై కఠినంగా ఉండండి
- సికింద్రాబాద్ సాధారణ ఎన్నికల పరిశీలకుడు సరోజ్‌కుమార్





యూసుఫ్‌గూడ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి సరోజ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో శనివారం ఆయన ఎన్నికల అధికారులతో కలిసి ఈవీఎంలు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈవీఎంలను భద్రపరిచిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తుపై ఆరా తీశారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? లేదా అని వాటి పనితీరును పరిశీలించారు. సాయుధ బలగాలు స్ట్రాంగ్ రూమ్ వద్ద చేపట్టిన భద్రతను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గం పరిధిలోని 245 పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు, అక్కడ తీసుకుంటున్న చర్యలపై సంబంధిత ఎన్నికల అధికారులను, జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ప్రశ్నించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14లోని స్టడీ సర్కిల్ పోలింగ్ పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఆయన అక్కడ పోలింగ్‌కు కావలసిన ఏర్పాట్లు, ఓటర్ల కోసం చేపడుతున్న చర్యలను ఆరా తీశారు.

- పోలింగ్ కేంద్రాలు, భద్రత, పోస్టల్ బ్యాలెట్, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ వివరాలు తదితర ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరక్కుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.
- నియోజకవర్గంలో 64 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌తో పాటు పటిష్ట పోలీస్ భద్రతను ఏర్పాటు చేసినట్లు అధికారులు సాధారణ పరిశీలకుని దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై నమోదైన కేసుల వివరాలు కూడా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటరు నమోదు శాతం పెంచేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి ఇంటి వద్దే ఓటు నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.
- మద్యం, నగదు అక్రమ రవాణా నివారణకు చేపడుతున్న తనిఖీల వివరాలను కూడా అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించరాదన్నారు. ప్రలోభాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంటింటికీ పోల్ చీటీల పంపిణీ తీరును కూడా వివరించారు. సాధ్యమైనంత త్వరగా పోల్ చీటీల పంపిణీ పూర్తి చేసే విధంగా పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వివిధ రూపాల్లో నిఘా పెంచిన విషయాన్ని పేర్కొన్నారు.
- ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారా? అనే అంశంపై ఆరా తీశారు. అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు.

డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలించిన అధికారులు

వెంగళరావునగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎన్నికల పరిశీలకులు డాక్టర్ సరోజ్‌కుమార్ సూచించారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్‌ను శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూంకు వెళ్లి ఏర్పాట్లు, ఇతర వివరాలను తెలుసుకున్నారు. ఈవీఎంలను భద్ర పరిచేందుకు కావాల్సిన పోలీసు సిబ్బంది, ఇతర సదుపాయాలు, ఉన్నాయా లేవా అంటూ ఆరా తీశారు. డీఆర్‌సీ సెంటర్‌ను నిరంతరం ఎన్నికల అధికారులు పరిశీలిస్తూ ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది, ఎన్నికల సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కనిపెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, తదితర అంశాలపై వారికి సూచనలు ఇచ్చారు. సికింద్రాబాద్ ఆర్‌డీఓ దశరథ్‌సింగ్, ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్, జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, ఇంజినీరింగ్ విభాగం ఈఈ రాజ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాణి, ఏఎంసీలు కమల్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

వంద శాతం ఓటింగ్‌కు కృషి చేయాలి



దేవరకొండ బస్తీలో ఓటర్లను సత్కరిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

వెంకటేశ్వరకాలనీ: ఎన్నికల్లో ప్రతి బూత్‌లో వందశాతం పోలింగ్ అయ్యేందుకు కృషి చేయాలని జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీసీవో ఆశా విరానిక కోరారు. ఓటింగ్ శాతం పెంచే కార్యక్రమాల్లో భాగంగా శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 5లోని దేవరకొండ బస్తీలో ఓటర్లను జాగృతం చేసేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించి వారిని సన్మానించారు. నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ నమోదు అవుతున్న బూత్‌లలో దేవరకొండ బస్తీ బూత్ కూడా ఒకటి అని ఆమె అన్నారు. ఈ బూత్‌ను ఆదర్శంగా తీసుకొని అన్ని బూత్‌లలో ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కచ్చితంగా ఎన్నికల రోజును ఇల్లు వదిలి బయటికి రావాలని ఆమె కోరారు. స్థానిక నేత జావేద్ తదితరులు పాల్గొన్నారు.

సర్ఫరాజ్ అహ్మద్‌కు ఓటరు స్లిప్పు అందజేత



సర్ఫరాజ్ అహ్మద్‌కు ఓటరు స్లిప్పును అందజేస్తున్న జెడ్‌సీ హేమంత్

బంజారాహిల్స్: మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ఓటరు తేలికగా పోలింగ్ కేంద్రానికి వచ్చేలా ఓటరు స్లిప్పులను అందజేస్తున్నామని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కాడే వెల్లడించారు. శనివారం జూబ్లీహిల్స్‌లో నివసించే తెలంగాణ రాష్ట్ర జాయింట్ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు ఆయన ఓటరు స్లిప్పును అందజేశారు. ఈ సందర్భంగా ఓటరు స్లిప్పుల పంపిణీ, తీసుకుంటున్న చర్యలపై ఆయనకు వివరించారు. ప్రతి ఓటరుకు స్లిప్పులు అందేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ మేరకు బీఎల్‌ఓలకు తగిన సూచనలిచ్చామని వెల్లడించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ ఎలక్ట్రోరల్ రిజిస్టర్ ఆఫీసర్ ప్రశాంతి, స్థానిక బీఎల్‌ఓ శివ తదితరులు పాల్గొన్నారు.

పద్మారావుగౌడ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించుకుందాం

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ: సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ బూత్ స్థాయి కార్యకర్తల సమాశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని పార్టీ నేతలకు, కార్యకర్తలు తగు సూచనలు, సలహాలు చేశారు. పద్మారావు గౌడ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, కె.సదానంద్, బద్దుల ఓం ప్రకాష్ యాదవ్, బి.రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ మళ్లీ ప్రధాని కావడం ఖాయం



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కాచిగూడ: కేంద్రంలో నరేంద్రమోదీ మళ్లీ ప్రధానిగా రావడం ఖాయమని సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కాచిగూడ డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం గోకుల్ థామ్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తనను మరోసారి భారీ మెజార్టీతో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్టీ ఎ.సూర్యప్రకాష్ సింగ్, సి.నందకిషోర్ యాదవ్, ఎస్.అరవింద్, చిట్టి శ్రీధర్, సుభాష్ పటేల్, ఎక్కాల కన్నా, కృష్ణకుమార్, దిలీప్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్, డీఏ పెంచాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉద్యోగ విరమణ చేసిన ఆంధ్రా బ్యాంక్ ఉద్యోగులకు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్, డీఏని పెంచాలని ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జంట నగరాల విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వారణాసి కృష్ణమూర్తి, ఎస్.ఎస్.రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిటైర్డ్ ఆంధ్రాబ్యాంకు ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగులకు ఉచితంగా హెల్త్ ఇన్సూరెన్స్‌లు అందించాలని, కానీ పక్షంలో 50 శాతం సబ్సిడీతో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, లేదా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. ఉన్నత స్థాయి అధికారులుగా పని చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు నెలకు 5 నుంచి ఆరు వేల పెన్షన్ మాత్రమే వస్తుందని ఇది దేనిని సరిపోవడం లేదన్నారు. ఆంధ్రాబ్యాంక్‌ను యూనియన్ బ్యాంకులో విలీనం చేసిన తరువాత తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ ఉద్యోగులు కమల్‌కాంత్ జాదవ్, సి.సుభాష్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి వారు నివాళులు అర్పించారు. అసోసియేషన్ డిప్యూటీ సెక్రటరీ రమణ, ఉపాధ్యక్షులు త్రిపురాంబ, ప్రేమ్‌కుమారి పాల్గొన్నారు.



దానంను భారీ మెజారిటీతో గెలిపించాలి



పటేల్‌నగర్ ప్రచారం చేస్తున్న దానం నాగేందర్, కాంగ్రెస్ నాయకులు



దానం నాగేందర్ సమక్షంలో పార్టీలో చేరిన మహ్మద్ ముస్తాఫా



కాచిగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడకు చెందిన బీఆర్‌ఎస్ నేత మహ్మద్ ముస్తాఫా తన అనుచరులుతో దానం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి నాగేందర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దానంను భారీ మెజారీతో గెలిపించుకోవాలని అన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ మాజీ కార్యదర్శి బండ సూరి, గోల్నాక డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భావి ధన్‌రాజ్, పార్టీ నేతలు దిడ్డి రాంబాబు, నారాయణ స్వామి, పులి జగన్, గరిగంటి రమేష్, సుదర్శన్, నవాజ్, ముబాషీర్, అక్బర్, ఇమ్రాన్, అహ్మద్, తఫీక్ పాల్గొన్నారు.

పటేల్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి దానం ప్రచారం

అంబర్‌పేట: కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేస్తే ఆరు గ్యారంటీలు మరింత పటిష్టంగా అమలువుతాయని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి దానం నాగేందర్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో మాజీ ఎంపీ వి.హన్మంతరావు, ఖైరతాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. మత రాజకీయాలను ప్రోత్సహించవద్దని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్లు పులి జగన్, దిడ్డి రామ్‌బాబు, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, లక్‌పతి యాదగిరి గౌడ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, అనిల్‌కుమార్, తొల్పునూరి కృష్ణగౌడ్, యాసిన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దానంకు వడ్డెర సంఘం మద్దతు

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్‌ను శనివారం వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జె.సత్యనారాయణ రాజు, వైస్ చైర్మన్ ఎత్తిర అంతయ్య మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. అనంతరం వారు గాంధీనగర్‌లో మాట్లాడుతూ... వడ్డెర్ల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ పార్టీ సుముఖంగా ఉందని ఆయన చెప్పారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయన వడ్డెర్ల మద్దతు కోరారని, తాము పూర్తి మద్దతు ప్రకటించామన్నారు. వడ్డెర్లను అన్ని విధాలా ఆదుకోవడంతో పాటు, రాజకీయంగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. నేతలు జె.రాములు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి



మంత్రి శ్రీధర్‌బాబు, అంజన్‌కుమార్‌యాదవ్‌లను సన్మానించిన శ్రీకాంత్‌గౌడ్

ముషీరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్‌బాబు, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌లను కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను వివరాలను తెలియజేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉందని ఎంపీ సీట్లు పెద్ద ఎత్తున గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభినందన



గోపాల్‌రెడ్డిని అభినందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: కరాటేలో ప్రపంచ రికార్డు సాధించిన కాచిగూడ ప్రాంతానికి చెందిన కరాటే మాస్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డిని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అభినందించారు. శనివారం కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి కిషన్‌రెడ్డిని గోపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డిని కేంద్రమంత్రి అభినందించి ఘనంగా సత్కరించారు. బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, సి.నందకిషోర్ యాదవ్, అమృతరెడ్డి, సుభాష్ పటేల్, లక్ష్మపురి సత్యనారాయణ, శీర్‌సాగర్, క్రిష్ణకుమా తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య సమాచారం మేరకు... గుర్తుతెలియని వ్యక్తి (50) బుద్వేల్–ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతున్నడు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐపై దౌర్జన్యం: చైన్ దోపిడీ

కాచిగూడ: ఎంఎంటిఎస్ రైల్లో ప్రయాణిస్తున్న సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ చైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దోపిడీ చేసిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమబెంగాల్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ప్రసాద్ నగరంలోని మైలార్‌దేవ్ పల్లిలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి అతను ఎంఎంటీఎస్ రైలులో వెళ్తుండగా యాకుత్‌పుర–ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య ముగ్గురు ఆగంతకులు చాకుతో బెదిరించి ఆయన మెడలోని 15 గ్రాముల బంగారు గొలుసు, రెండు సెల్‌ఫోన్లు లాక్కుని పారిపోయారు. బాధితుడు శనివారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాల కోసం చోరీలు

- బైక్, సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్
- మూడు బైక్‌లు, 14 సెల్‌ఫోన్లు స్వాధీనం

హిమాయత్‌నగర్: జల్సాలకు అలవాటుపడి ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 14 సెల్ ఫోన్లు, మూడు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, డీఐ నాగార్జునలతో కలిసి ఏసీపీ శంకర్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 22న అఫ్జల్‌గంజ్ నుంచి నారాయణగూడకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్న రాము అనే వ్యక్తి సెల్ ఫోన్ బస్సులో చోరీకి గురైంది. దీంతో బాధితుడు నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ టీవీ ఆధారంగా నిందితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రాంకోఠి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన చాకలి బాలరాజు, మెదక్‌కు చెందిన కురాం రాజు ఇటీవల పరిచయం ఏర్పడింది. బలరాజ్ ఫోన్లు, రాజు బైకులను దొంగలించడంలో సిద్ధహస్తులు. ఇద్దరు కలిసి బస్సులలో ఫోన్లను, సీబీఎస్ వద్ద పార్క్ చేసిన బైకులను దొంగిలించి జల్సాలు చేసుకునేవారు. గతంలో బలరాజుపై 18, రాజు పై 2 కేసులు ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఎంపీగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా: కిషన్‌రెడ్డి



జైస్వాల్ గార్డెన్‌లో కాలనీ అసోసియేషన్ ప్రతినిధుల మద్దతు కోరుతున్న కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ప్రజలు గర్వపడేలా నీతి నిజాయితీతో పనిచేశానని తనకు ఓటు వేసి ఎంపీగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అవినీతి, తలవంపు పనులు చేయకుండా ఓటు వేసిన ఓటర్లు తలెత్తుకునేలా పనిచేశామన్నారు. సోమవారం గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై మద్దతు కోరారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, ప్రతినిధులు ప్రసన్నాంజనేయులు, రామగౌడ్, శ్రీధర్‌గౌడ్, డాక్టర్ రాజ, బాలకృష్ణ యాదవ్, బీజేపీ నేతలు రవీందర్ గౌడ్, కె.రవీందర్, ఆర్.కె.రామ్‌చందర్, మహ్మద్ సలీమ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



ముషీరాబాద్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: దేశంలో బీఆర్‌ఎస్ బెస్ట్ పార్టీగా నిలిచేలా కేసీఆర్ నాయకత్వంలో తీర్చిదిద్దిన అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తాలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, మీడియా సెల్ ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇందిరాపార్కు వద్ద...

కవాడిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కవాడిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్.డి.సాయి కృష్ణ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై జెండా ఆవిష్కరించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ముషీరాబాద్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల శిథిలాలు.. దీక్ష శిబిరం తొలగింపు



సామగ్రిని తరలిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: కోర్టు ఆదేశాల పేరుతో గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీలో కూల్చివేతకు గురైన ఇళ్ల శిథిలాలను శనివారం పూర్తిగా తొలగించారు. తమకు న్యాయం చేయాలని బాధితులు గడచిన 90 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేపడుతున్న శిబిరాన్ని తొలగించి... బాధితులను చిక్కడపల్లి ఠాణాకు తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న బీజేపీ సికింద్రాబాద్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఇళ్లు కోల్పోయిన వారికి యుద్ధప్రతిపాదికన నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. లేకుంటే బస్తీవాసులతో కలసి న్యాయపోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు బాధితులకు సంఘీభావం ప్రకటించారు. జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌వో మైత్రేయి, ఎస్‌ఎస్ గోవర్ధన్, జవాన్‌లు, ఎస్‌ఎఫ్‌లు, పోలీసులు, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, నేతలు సత్యేందర్, సుక్క యాదగిరి, నేతలు ఎం.బి.కృష్ణ, నరేష్, గణేష్, ఆనంద్‌రావు, సంపత్, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



కార్పొరేటర్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ ఆంధ్రా కేఫ్ వద్ద ఉన్న శ్రీ ముత్యాలమ్మ ఆలయం 24వ వార్షికోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ కమిటీ గాంధీనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు గడ్డం మధుసూదన్, బి.సంతోష్, జె.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

చిక్కడపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపునకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం వీవీ గిరి నగర్, సబర్మతీనగర్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నేతలు ముఠా నరేష్, జీవై గిరి, పున్న సత్యనారాయణ, బోనం బన్ని, మిద్దె సురేష్ తదితరులు పాల్గొన్నారు.